# ఇరిగేషన్.. హస్తవ్యస్తం!

## సర్కారు వైఫల్యం.. రైతులకు శాపం • పడకేసిన ప్రాజెక్టుల మరమ్మతులు

- అరకొర నీళ్లు..పలుచోట్ల లీకేజీలు
- ఇరిగేషన్‌లో కీలక పోస్టులు ఖాళీ
- పంప్‌హౌస్‌ల నిర్వహణపై నిర్లక్ష్యం
- బిల్లులు రాక సాగని పనులు
- 478నిరుటి పనులే నేటికీ పెండింగ్
- ఈఏడాది 73% పనుల్లో జాప్యం
- ఉన్నది మరో 3 నెలల గడువు
- వట్టిపోయిన బోర్లు, ఎండిన పంటలు



హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ఆనకట్టలు, కాలువల పరిధిలో చేపట్టిన మరమ్మతులు ఎక్కడివి అక్కడే పడకేశాయి. సీజన్ గడచిపోతున్నా ఇప్పటికీ చాలాచోట్ల పనులే చేపట్టలేదు. పనులపై ప్రభుత్వానికి ఒక ప్రణాళిక అంటూ లేకుండా పోయినట్టు తెలుస్తున్నది. మరోవైపు నీటిపారుదల శాఖను భారీగా కీలక పోస్టుల ఖాళీలు పట్టి పీడిస్తున్నాయి. ఫలితంగా నీటి నిర్వహణ గాడి తప్పి సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. కాలువలు, చెరువుల తూములు, పంప్‌హౌస్‌లు, ప్రాజెక్టుల గేట్లు తదితర మరమ్మతుల పర్యవేక్షణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఏఈ నుంచి సీఈల వరకు ఆర్థిక అధికారాలను బదలాయించింది. అందులో భాగంగా మూడేండ్లుగా ప్రాజెక్టుల పర్యవేక్షణ బాధ్యతలను ఓఅండ్ఎం విభాగమే పరిశీలిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన 1,294 పనుల్లో ఇప్పటికీ 478 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నాటికి మంజూరు చేసిన పనుల్లో దాదాపు 73 శాతం మొదలే కాలేదు. ప్రధానంగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే మరమ్మతులు మందకొడిగా కొనసాగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులే వివరిస్తున్నారు. ఓఅండ్ఎం పనుల నిర్వహణకు వేసవి కాలమే అనువైనది. వర్షాకాలంలో వానలు, వరదలు, బురద వల్ల ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవు. శీతాకాలంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వాలు ఉండి, నీటి విడుదల కొనసాగడంతో పనులు చేపట్టడం కష్టంగా ఉంటుంది. వేసవిలో నీటినిల్వాలు తగ్గిపోయి, కాలువలకు నీటి విడుదల బంద్ చేయడం వల్లే సాధ్యమైనంత వేగంగా, సజావుగా మరమ్మతులు నిర్వహించవచ్చు. ఇందుకు 3 నెలలు మాత్రమే సమయం ఉంటుంది.

### నిధుల విడుదలలో నిర్లక్ష్యం

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఓఅండ్ఎం పనులు మందకొడిగా కొనసాగడానికి ప్రధాన కారణమని క్షేత్రస్థాయి ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు చెప్తున్నారు. ఓఅండ్ఎం పనులకు 2023-24లో మొత్తం రూ.337.80 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం రూ.74.95 కోట్ల మేర పనులే పూర్తికాగా ఆ నిధుల్లోనూ 25 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఇప్పటికీ రెండు త్రైమాసికాల నిధులనే ప్రభుత్వం విడుదల చేసింది. మిగతా 2 త్రైమాసికాల నిధులను ఇవ్వలేదు. బీఆర్వో విడుదల చేసిన నిధులను సైతం ఇప్పటికీ విదిల్చలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓఅండ్ఎం 205.66 కోట్ల పనులను మంజూరు చేయగా, రూ.17.70 కోట్ల పనులే పూర్తయ్యాయి. అందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికీ రూపాయి విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో పనులను చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు జంకుతున్నారు.

### మందకొడిగా పనులు

ప్రస్తుతం ఓఎండ్ఎం పనులు మందకొడిగా కొనసాగుతున్నాయి. 2023-24లో 1,294 పనుల్లో 816 పనులే పూర్తి కావడం గమనార్హం. మరో 478 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 2024-25లో 926 పనులకు ఆమోదం తెలిపితే, కేవలం 247 (27శాతం) పనులే పూర్తికాగా, 73 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. 272 పనులు టెండర్ దశలోనే ఉండిపోయాయి. ఒప్పంద దశలో మరో 126 పనులు ఉన్నాయి. ఇదే పరిస్థితి ఉంటే జూన్ నాటికి పూర్తిచేయడం కష్టమేనని తెలుస్తున్నది.

### మరమ్మతులపై సర్కారు శీతకన్ను

ఓఅండ్ఎం పనులపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. అత్యవసర పనులపైనా ప్రభుత్వానికి పట్టింపులేకుండా పోయింది. ఈ ఏడాది భారీ వరదలకు వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర జిల్లాలో పదుల సంఖ్యలో చెరువులు తెగిపోయాయి. వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. శాశ్వత మరమ్మతులకు అనుమతులు ఇచ్చారు. కానీ ఇప్పటికీ ప్రారంభించలేదు. వివిధ ప్రాజెక్టుల్లో సత్వరమే చేపట్టాల్సిన పనులపైనా ప్రభుత్వం దృష్టిసారించిన దాఖలాలు లేవు.

### నీటిపారుదల శాఖలో భారీగా ఖాళీలు

నీటిపారుదల శాఖలో భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికీ రెగ్యులర్ అధికారులను, సిబ్బందిని నియమించకుండా ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించడంతో నీటి విడుదల పర్యవేక్షణకు క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో లేని దుస్థితి నెలకొన్నది. అదనపు బాధ్యతల నేపథ్యంలో పంటలకు నీటి విడుదలపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో కమాండ్ ఏరియా పరిధిలోని ఆయకట్టుకు సైతం పూర్తిస్థాయిలో సాగునీరందని దుస్థితి నెలకొన్నది. దీంతో వ్యవ సాయ బోర్లన్నీ వెలవెలబోతూ పొట్ట దశలో పంటలు ఎండుతున్నాయి.

### ప్రణాళికాలేమి తొలి వైఫల్యం..

ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, కడెం, నిజాంసాగర్, సింగూరు, నాగార్జునసాగర్, శ్రీశైలం తదితర మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో తాగు నీటి అవసరాలు పోగా, యాసంగికి 354.88 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐఈఏఎం) గత డిసెంబర్‌లో లెక్కతేల్చింది. మొత్తంగా 42.48 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని నిర్ణయించింది. మేజర్ ప్రాజెక్టుల్లో 277.59 టీఎంసీలు ఉండగా వాటి కింద 30.96 లక్షల ఎకరాలకు, మీడియం ప్రాజెక్టుల్లో 30.38 టీఎంసీలుండగా 2.68 లక్షల ఎకరాలకు, మైనర్ ప్రాజెక్టుల పరిధిలో 37.40 టీఎంసీలతో 7.23 లక్షల ఎకరాలకు, ఐడీసీ లిఫ్టుల కింద 9.5 టీఎంసీలతో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరందించవచ్చని అంచనాలు రూపొందించింది. వెట్‌క్రాప్స్‌కు 24.54 లక్షల ఎకరాలు, ఐడీ క్రాప్స్‌కు 17.94 లక్షల ఎకరాలకు నీరందించేందుకు తైబందీ ఖరారు చేసింది. జనవరి 1 నుంచి మార్చి 31 వరకు ఆన్ అండ్ ఆఫ్ సిస్టమ్‌లో మొత్తం 6 తడులకే నీరందించాలని నిర్ణయించింది. కమిటీ వేసిన ప్రణాళికలన్నీ ఇప్పుడు తారుమారయ్యాయి. అధికారులు వరి, ఆరుతడి పంటలకు తైబందీ ఖరారు చేయగా, క్షేత్రస్థాయిలో రైతులు అంచనాలకు మించి వరి సాగుకే మొగ్గుచూపారు. ఆరుతడి పంటల సాగు నామమాత్రంగా చేపట్టారని ఫీల్డ్ ఇంజినీర్లు చెప్తున్నారు. ఇదే విషయాన్ని ముందుగానే ఉన్నతాధికారులకు నివేదించామని, పూర్తిస్థాయిలో నీరివ్వలేమని, ప్రాజెక్టుల కింద ఆయకట్టును కుదించాలని తేల్చిచెప్పామని వివరిస్తున్నారు. చాలా చోట్ల ప్రాజెక్టుల ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాలువల్లో పూడిక పేరుకుపోయిందని చెప్తున్నారు. వివిధ కారణాలతో దిగువకు నిర్దేశించిన మొత్తంకంటే తక్కువే నీరు వెళ్తున్నదని వివరించారు. చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. అయినా వారి మాటలను పెడచెవిన పెట్టి ప్రణాళికలను రూపొందించారు.

#### ఓఅండ్ఎం పనుల వివరాలు

| క్యాటగిరీ | 2023-24 | నిధులు (లక్షల్లో) | 2024-25 (డిసెంబర్ వరకు) | నిధులు |
|---|---|---|---|---|
| టెండర్ స్టేజీలో ఉన్న పనులు | 101 | 1460.433 | 272 | 8677.473 |
| అగ్రిమెంట్ స్టేజీలో ఉన్న పనులు | 61 | 1610.34 | 126 | 5673.435 |
| పురోగతిలో ఉన్న పనులు | 316 | 23213.618 | 281 | 4445.4 |
| పూర్తయిన పనులు | 816 | 7495.886 | 247 | 1770.223 |
| మొత్తం పనులు | 1294 | 33780.277 | 926 | 20566.531 |

### చివరి ఆయకట్టు కాదు మొదటికే మోసం..

రాష్ట్రవ్యాప్తంగా వానకాలంలో అత్యధిక వర్షాలు కురిశాయి. ప్రధాన ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. అయినా ప్రస్తుత యాసంగిలో చివరి ఆయకట్టుకు కాదుకదా మొదట ఉన్న ఆయకట్టుకే నీరందని విచిత్ర పరిస్థితి నెలకొన్నది. ప్రణాళికలు తారుమారు కావడం ఒకటైతే నిర్దేశిత షెడ్యూల్‌ను పాటించకపోవడం కూడా మరో కారణమని తెలుస్తున్నది. రిజర్వాయర్లలోని నీటినిల్వలను పరిగణలోకి తీసుకుని ఏ మేరకు సాగునీటిని ఇవ్వగలమో అంచనా వేసి ఆ మేరకు యాసంగి తైబందీని ఖరారు చేయడం పరిపాటి. కాలువల ద్వారా సమృద్ధిగా నీటిని విడుదల చేయడంతోపాటు చెరువులనూ నింపుతూ వస్తే భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేది. కానీ ఈ ఏడాది కేవలం 6 తడులే ఇస్తామన్న ప్రభుత్వం అదీ సమృద్ధిగా విడుదల చేయడం లేదు. మరోవైపు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ జోక్యం చేసుకుని ఒత్తిడి తెచ్చి తమ ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయించుకుంటున్నారని, దీంతో ముందస్తు ప్రణాళికలన్నీ చిన్నాభిన్నమయ్యాయని సంబంధిత అధికారులే వాపోతున్నారు. భూగర్భజలాలు అడుగంటడడంతో కాలువలపై ఎక్కడికక్కడ మోటర్లను పెట్టి నీళ్లను గతంలో కంటే ఎక్కువగా నీటిని రైతులు మళ్లించుకుంటున్నారని, డిస్ట్రిబ్యూటరీలకు నిర్దేశిత లెక్క ప్రకారం సాగునీరు సరఫరా కావడంలో వైఫల్యాలు ఏర్పడ్డాయని, నీటినిర్వహణ చిన్నాభిన్నమైందని వివరిస్తున్నారు.

### క్షేత్రస్థాయి పర్యవేక్షకులేరీ?

సాగునీటి విడుదల పర్యవేక్షణను ప్రభుత్వం గాలికి వదిలేసింది. నీటిపారుదలశాఖ ఇన్‌చార్జిల పాలనలోనే సాగుతున్నది. కీలక పోస్టులన్నీ ఖాళీ అయ్యాయి. పూర్తికాలపు అధికారులను నియమించకుండా ప్రభుత్వం ఇష్టారీతిన ఇంజినీర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏడాదిన్నరగా నెట్టుకువస్తున్నది. మొత్తం 22 చీఫ్ ఇంజినీర్ పోస్టులు ఉంగా, 15 మంది విరమణ పొందారు. ఏడాది క్రితమే ఈఎన్సీ జనరల్ పోస్టు ఖాళీకాగా, ఓఅండ్ఎం ఈఎన్సీ పోస్టు కూడా ఖాళీ అయ్యింది. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈతో పాటు వివిధ జిల్లాల సీఈలంతా విరమణ పొందగా, ఈఈలు, ఎస్ఈలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పలువురు ఈఈలు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ప్రధాన కార్యాలయాలకే పరిమితమయ్యారని వివరిస్తున్నారు. పనిభారంతో నీటివిడుదల పర్యవేక్షణపై ఏమాత్రం దృష్టిసారించలేని దుస్థితి నెలకొన్నది.

## అపర అన్నమయ్య ఇకలేరు

### గుండెపోటుతో గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ మృతి

- వెయ్యికిపైగా అన్నమయ్య కీర్తనలకు స్వరకల్పన
- టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా సుదీర్ఘకాలం సేవలు
- ఇటీవల యాదగిరిగుట్ట ఆలయంలోనే ఆఖరి ప్రదర్శన
- నేపథ్య గాయని ఎస్ జానకికి బాలకృష్ణప్రసాద్ మేనల్లుడు



హైదరాబాద్, తెలుగు యూనివర్సిటీ, మార్చి 9: తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు, సంగీత స్వరకర్త, శాస్త్రీయ సంగీత గాయకుడు, కళారత్న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (76) కన్నుమూశారు. తిరుమలలోని తన స్వగృహంలో గుండెపోటు రావడంతో ఆదివారం తుదిశ్వాస విడిచారు. వెయ్యికిపైగా అన్నమయ్య సంకీర్తనలకు స్వరకల్పన చేసిన గరిమెళ్ల.. ప్రముఖ సంగీత విద్యాంసుడిగా పేరొందారు. ఆయన స్వరకల్పన చేసిన 'వినరో భాగ్యము విష్ణుకథ', 'పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు', 'జగడపు చనువుల జాజర'.. తదితర సంకీర్తనలు ఆయనకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. వచ్చెను అలిమేలు మంగ, తిరువీధుల మెరసీ దేవదేవుడు, చూడరమ్మ సతులారా, జయలక్ష్మి వరలక్ష్మి, ఆదిమూలమే మాకు అంగరక్ష, అంతయు నీవే హరి, ఏమని పొగడుదుమే తదితర కీర్తనలు కూడా ఆయన స్వరపరిచినవే. సంప్రదాయ కర్ణాటక, లలిత, జానపద సంగీతంలోనూ ఆయన ప్రసిద్ధులు. టీటీడీ ఆస్థాన విద్యాంసుడుగా, కంచి కామకోటి పీఠం, అహోబిల మఠం ఆస్థాన సంగీత విద్వాంసుడుగా సేవలు అందించారు. గత శుక్రవారం నాడే ఆయన యాదగిరిగుట్టలో తన ప్రదర్శనతో ఆహుతులను అలరించారు. ఇంతలోనే ఆయన మరణ వార్త తెలియడంతో సంగీతప్రియులు విచారం వ్యక్తంచేస్తున్నారు.

### శ్రీవారి సేవకే జీవితం అంకితం

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి వాస్తవ్యుడైన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ తిరుపతిలో స్థిరపడి అన్నమయ్య అంశగా ప్రశంసలు అందుకున్నారు. 197౦లో టీటీడీ అన్నమయ్య ప్రాజెక్ట్‌లో గాయకుడిగా చేరిన గరిమెళ్ల 2006లో ఉద్యోగ విరమణ పొందారు. అన్నమయ్య కీర్తనలను ఆలపించడం, స్వరపరచడం, రికార్డు చేయడం, పుస్తకాలు ప్రచురించడం ద్వారా తన జీవితాన్ని తిరుమల శ్రీవారి సేవకే అంకింత చేసుకున్న మహనీయుడు గరిమెళ్ల. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం సైతం లభించింది. విద్వత్తు ఉన్నా, శిఖరమంత ప్రతిభ పుక్కిట పట్టినా ఎంతో వినమ్రత గల వ్యక్తిగా, మానవీయ హృదయం ఉన్న సంగీత విద్యాంసుడిగా పేరొందారు. మహామహులు ఎందరో శాస్త్రీయ కచేరీలు చేసినా తెలుగునాట సంకీర్తన యజ్ఞ ప్రక్రియను తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత మాత్రం గరిమెళ్లకే దక్కుతుంది. భక్తి టీవీ హరి సంకీర్తన ద్వారా ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. ఆరువేలకుపైగా కచేరీలు చేశారు. 300 కీర్తనలు నాన్‌స్టాప్‌గా పాడిన ఘనత సాధించారు. సిలికానాంధ్ర సంస్థ సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన లక్ష గళార్చనలో ప్రధాన గాయకుడిగా మెప్పించారు. ఆ కార్యక్రమం గిన్నిస్‌బుక్ వరల్డ్‌రికార్డులో చోటుదక్కించుకోవడం విశేషం. ఆయన భక్తి గీతాలు రచించడంలోనూ దిట్ట. స్వయంగా హనుమాన్ భక్తుడైన ఆయన 21 ఆంజనేయ కృతులు రచించి స్వరపరచారు. వినాయకుడిపై 50 కృతులు రచించారు. వెయ్యికిపైగా కీర్తనలు రచించి, స్వరపరచి జన బాహుళ్యంలోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారు. ఆయన స్వరపరచిన సంకీర్తనలను అనేక పుస్తకాలుగా టీటీడీ ప్రచురించింది. ఆయనకు భార్య రాధ, కుమారులు పవన్‌కుమార్, అనిల్‌కుమార్ కూడా శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితమై సేవలు అందిస్తున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు నేదునూరి కృష్ణమూర్తికి శిష్యుడు, ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్ జానకికి మేనల్లుడు కావడం మరో విశేషం. సినిమా అవకాశాలు వచ్చినా శాస్త్రీయ సంగీతానికి, స్వామి వారి సేవకు అంకితమై జీవించారు. గరిమెళ్ల మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.



దేవాదుల మూడో దశలో దేవన్నపేటలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన పంపుహౌస్


## కేసీఆర్ ప్రాజెక్ట్.. రేవంత్ రిబ్బన్ కటింగ్

- బీఆర్ఎస్ హయాంలోనే దేవన్నపేట పంప్‌హౌస్ పూర్తి
- కొత్త పంప్‌హౌస్‌తో వారంలో నిండనున్న ధర్మసాగర్
- పెండింగ్ పనులు పూర్తి చేయించిన కేసీఆర్ ప్రభుత్వం
- 16న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వరంగల్, మార్చి 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సమైక్య రాష్ట్రంలో సంక్షోభం ఎదుర్కొన్న తెలంగాణ సాగును బాగు చేసేందుకు పదేండ్ల పాటు కేసీఆర్ సర్కారు విశేషంగా కృషి చేసింది. ప్రతీ ఎకరాకు సాగునీరు లక్ష్యంగా పారిపాలన సాగించింది. కేసీఆర్ పూర్తి చేసిన సాగునీటి ప్రాజెక్టుల ఘనతను కాంగ్రెస్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని కీలకమైన మూడో దశ ఆయకట్టుకు కచ్చితంగా సాగునీరు అందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసింది. ధర్మసాగర్ రిజర్వాయర్ నిండితేనే జనగామ, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఆయకట్టుకు పూర్తిగా నీరు అందుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన కేసీఆర్ ధర్మసాగర్ రిజర్వాయర్‌కు వేగంగా నీరు చేరేందుకు అవసరమైన టన్నెల్, పంప్‌హౌస్ పనులను పూర్తి చేసింది. పంప్‌హౌస్‌కు రక్షణ పనులు జరుగుతున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. బీఆర్ఎస్ సర్కారు పూర్తి చేసిన పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించారు.

### కేసీఆర్‌తోనే మూడో దశ సాకారం

దేవాదుల ప్రాజెక్టును ఉమ్మడి రాష్ట్రంలోని సమైక్య ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక దేవాదుల ప్రాజెక్టును దాదాపుగా పూర్తిచేశారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతీఎకరాకు సాగునీరు అందించేలా కేసీఆర్ ప్రభుత్వం పని చేసింది. దేవాదుల ప్రాజెక్టుతో 9 జిల్లాల్లోని 5.57 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు అవసరమైన పనులు చేసింది. 2021 జూన్ 21న సీఎం కేసీఆర్ వరంగల్‌లో దేవాదుల ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. మూడో దశ పనులను వేగంగా పూర్తి చేసుకుందామని చెప్పారు.



కేసీఆర్ సర్కార్ నిర్మించిన పంపుహౌస్

### టన్నెల్... పంప్ హౌస్

మూడో దశ కింద గోదావరి నది నుంచి దేవాదుల పంప్ హౌస్‌ల ద్వారా భూపాలపల్లి జిల్లాలోని భీంఘన్‌పూర్ రిజర్వాయర్‌కు అక్కడి నుంచి రామప్ప చెరువుకు నీరు చేరుతుంది. అక్కడి నుంచి వరంగల్ నగర శివారులోని ఉనికిచర్ల వరకు 43.06 కిలోమీటర్ల టన్నెల్‌లో గోదావరి నీరు వస్తుంది. టన్నెల్ నుంచి వచ్చిన నీటిని అక్కడి నుంచి 6.86 కిలోమీటర్ల ధర్మసాగర్‌కు దేవన్నపేట వద్ద ఏర్పాటు చేసిన పంపులతో ధర్మసాగర్ రిజర్వాయర్‌కు తరలిస్తారు.

| దేవాదుల ప్రాజెక్టు | రిజర్వాయర్లు | పంపుహౌస్‌లు | ఆయకట్టు |
|---|---|---|---|
| మొదటి దశ | 3 | 4 | 1.24 లక్షల ఎకరాలు |
| రెండో దశ | 9 | 7 | 1.93 లక్షల ఎకరాలు |
| మూడో దశ | -- | 10 | 2.40 లక్షల ఎకరాలు |



జనగామ మండలం ఎల్లంల గ్రామంలో తన వ్యవసాయ భూమిలో నాలుగు బోర్లు వేసిన రైతు మచ్చ లక్ష్మయ్య



జనగామ జిల్లా ఎల్లంల గ్రామంలో ఎండిపోతున్న పంటను మేస్తున్న మేకలు

## దేవా.. నీళ్లు రావా!

### దేవాదుల ఆయకట్టు రైతుల అవస్థలు

- సాగునీరు రాక ఎండుతున్న పంటలు
- దేవాదుల పంపింగ్ వ్యవస్థ అస్తవ్యస్తం
- నిర్వహణ సంస్థకు బిల్లుల పెండింగ్
- గైర్హాజర్ రూపంలో కార్మికుల నిరసన
- వారం నుంచి ఆగిన పంపింగ్ వ్యవస్థ
- ఆయకట్టుపై అధికారుల కాకి లెక్కలు
- మూసుకుపోయిన పిల్ల కాలువలు
- ఎండిపోతున్న యాసంగి పంటలు



దేవాదుల ప్రాజెక్టులోని ఏడో డిస్ట్రిబ్యూటరీ వద్ద షట్టర్ లేని దుస్థితి

వరంగల్, మార్చి 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి): దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగానికి అష్టకష్టాలు మొదలయ్యాయి. యాసంగి పంటలకు సాగునీరందక అవస్థలు పడుతున్నారు. సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం ఈ కష్టాలను తెచ్చిపెట్టింది. ఉద్యమకాలంలోనే సాగునీటికోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన పోరాటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సాగునీరు అందించే లక్ష్యంతో దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు మొదలైంది. సమైక్య పాలకుల నిర్లక్ష్యంతో ఏండ్లుగా అది పూర్తికాలేదు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఆయకట్టు అంతటికీ సాగునీరు పారింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితి మళ్లీ మారింది. పంటలకు నీళ్లందించే పరిస్థితి లేకుండా పోయింది. యాసంగిలో నీటి సరఫరాపై ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో హనుమకొండ, జనగామ జిల్లాల్లోని దేవాదుల ఆయకట్టు రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. దేవాదుల పైపులైన్ నిర్వహణ సంస్థకు చెల్లించాల్సిన బిల్లులను ప్రభుత్వం చెల్లింకపోవడంతో ఆ సంస్థ తమ ఉద్యోగులకు, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదు. దీంతో వారంతా విధులకు గైర్హాజరయ్యారు. ఇలా వారంపాటు నీటి పంపింగ్ జరగలేదు. ఇదే దేవాదుల ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. వారంపాటు పంపింగ్ నిలిచిపోవడంతో రిజర్వాయర్లలో పంపింగ్‌కు అనుగుణంగా నీరు నిల్వ ఉండటంలేదు. మొదట వారం రోజులు రిజర్వాయర్లను నింపి తర్వాత పంపింగ్ చేయాల్సి వస్తున్నది. ఈ కారణంగా ఆయకట్టు పొలాలకు అంతంతమాత్రంగానే సాగునీరు అందుతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జనగామ జిల్లాలోని పంటలకు దేవాదుల ప్రాజెక్టు నీరు అందడమే లేదు. ఫలితంగా దేవరుప్పుల, బచ్చన్నపేట, పాలకుర్తి మండలాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్నది. భూగర్భజలాలు అడుగంటి తడులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

### 60 శాతం గ్రామాల్లో ఎండుతున్న పంటలు

దేవరుప్పుల మండలంలో 60 శాతం గ్రామాల్లో పంటలు ఎండిపోయాయి. స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా మండలంలోని వాగు అవతలి గ్రామాలకు నీళ్లు అందాల్సి ఉన్నది. ఇప్పటివరకు దేవాదుల నీటిని వదలడమే లేదు. ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ హయాంలో రెండుసార్లు పంటలకు సాగునీరు అందింది. భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీరుండేది. పదేండ్లు చెరువులు నింపారన్న భరోసాతో రైతులు ఈసారి పంటలు వేశారు. ఇప్పుడు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. పాలకుర్తి మండలంలోని కోతులబాధ, ఈరవెన్ను, శాతాపురం, మాధాపురం, ధర్మాపురం గ్రామాల్లో ఆలస్యంగా దేవాదుల నీటిని విడుదల చేశారు. కాలువలు లేని గ్రామాల్లో భూగర్భజలాలు పడిపోయి బోర్లు నీళ్లు పోయడమే లేదు. బచ్చన్నపేట మండలం బచ్చన్నపేట, అలీంపూర్, పోచన్నపేట, రామచంద్రాపూర్, కొన్నె చెరువుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి.

### లక్నవరం చెరువుకు చేరని నీరు

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గంగారం వద్ద గోదావరి నదిపై దేవాదుల పంపుహౌస్ ఉన్నది. మూడు దశలుగా ఈ ప్రాజెక్టు ఉన్నది. మొదటి దశలో రెండు మోటర్లు, రెండో దశలో రెండు మోటర్లు, మూడో దశలో ఆరు మోటర్లను ఏర్పాటుచేశారు. 10 మోటర్లతో ఐదు పైపులైన్ల ద్వారా భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారంలోని భీంఘన్‌పూర్ రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుంది. పంపుహౌస్‌లో 78.40 మీటర్ల నీటి నిల్వ ఉండేలా ఏర్పాటుచేశారు. ప్రస్తుతం 72 మీటర్ల నీటి నిల్వ ఉన్నది. ప్రస్తుతం 5 పంపులతో భీంఘన్‌పూర్ రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ జరుగుతున్నది. అక్కడి నుంచి రామప్ప చెరువులోకి బుధవారం నుంచి పంపింగ్ జరుగుతున్నది. రంగరావుపల్లి పంపుహౌస్‌లోని రెండు మోటర్లలో ఒక మోటరు ద్వారా పాకాల సరస్సుకు, అక్కడి నుంచి రంగాయచెరువుకు ఒక మోటరు ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. కాలువ ద్వారా గణపురం చెరువుకు నీటిని తరలిస్తున్నారు. ఈ దశలోని లక్నవరం చెరువుకు ఇదే పంపుహౌస్ నుంచి నీటిని తరలించాల్సి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం దీనికోసం చొరవ తీసుకోకపోవడంతో లక్నవరం చెరువుకు నీరు చేరడమే లేదు.

### ధర్మసాగర్ రిజర్వాయర్‌కు సరిగా చేరని నీరు

దేవాదుల సాగునీటి వ్యవస్థలో ధర్మసాగర్ రిజర్వాయర్ కీలకమైనది. ఇక్కడి నుంచే అత్యధిక ఆయకట్టుకు నీరు చేరుతుంది. గోదావరి పంపుహౌస్ వద్ద నీరు ఉన్నా నిర్వహణలోపంతో ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నిరంతరంగా పంపింగ్ చేయడంలేదు. దీంతో అక్కడి నుంచి పైన ఉన్న రిజర్వాయర్లకు నీరు చేరడం లేదు. దీని పరిధిలోని చెరువులకు నీరు చేరక పంటలు ఎండిపోతున్నాయి.

### ఉత్తర కాలువను మరిచిన సర్కార్

దేవాదుల ప్రాజెక్టు రెండో దశలో భీంఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి మరో పైపు లైన్ ద్వారా హనుమకొండ జిల్లా శాయంపేట మండలం చలివాగుకు, అక్కడి నుంచి ధర్మసాగర్‌కు పంపింగ్ చేసే వ్యవస్థ ఉన్నది. చలివాగులో 22 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నది. చలివాగును కేసీఆర్ ప్రభుత్వం రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసింది. దీని పరిధిలో 3,040 ఎకరాల ఆయకట్టు ఉన్నది. యాసంగిలో 1,800 ఎకరాలు తైబందీ ఇచ్చి నీటిని అందిస్తున్నారు. పంటలకు సాగునీరు అందించే ప్రస్తుత పరిస్థితుల్లో రూ.10 కోట్లతో ప్రభుత్వం చలివాగు కాల్వ లైనింగ్, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నది.

### పదేండ్ల కిందటి కరువును మళ్లీ చూస్తున్నం



పదేండ్ల కిందటి కరువు పరిస్థితుల్ని మళ్లీ చూస్తున్నం. గత ప్రభుత్వం పదేండ్లు చెరువులు, కుంటలు నింపింది. నాకున్న ఎనిమిది ఎకరాలు ఈసారి సాగు చేసిన. బోర్లు సరిగ్గా పోయడం లేదు. భూగర్భజలాలు అడుగంటి పోతున్నయ్. దీంతో మూడెకరాలు ఎండిపోతున్నది. గతంలో చెరువులు, కుంటలు నింపితే బోర్లు మస్తుగా పోసేది. కరెంటు నిండుగా వచ్చేది. ఏ రందీ లేకుండె. కానీ, ఏడాది నుంచి సాగుకు నానా పాట్లు పడుతున్నం. మార్పు అంటే ఏందో అనుకున్నం. ఇంత మార్పు వస్తదనుకోలే.

- ఆత్కూరి కనకయ్య, కొడవటూరు, బచ్చన్నపేట మండలం, జనగామ జిల్లా

### నీళ్లు లేక పంటలెండుతున్నయ్



కొతులబాధ, శాతాపురం గ్రామాలకు స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి దేవాదుల కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తారు. బోయినిగూడెం వద్ద గేట్లు లేకపోవడంతో నీళ్లకోసం కొట్లాటలు అయితున్నయి. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్. బోర్లల్ల నీళ్లు లేక మోటర్లు పోస్తలేవు. వెంటనే బోయినిగూడెం వద్ద గేట్లు ఏర్పాటు చేయాలి.

- జక్కుల రాజు, రైతు ఈరవెన్ను, పాలకుర్తి మండలం